

Registered No : APTEL/25/A0818

ఇది కద నిజం

సామాన్యుని సమస్యలపై నిత్యం పోరాడే ఆయుధంగా.. జాతీయ తెలుగు దిన పత్రిక



మంగళవారం 20-10-2026 | పేజీలు :4 | వెల :2 | సంపుటి :02 | సంచిక :124 | www.edhikadhanijam.com | ఎడిటర్ : బాలరాజు గౌడ్

ఢిల్లీలో డ్రగ్స్ ముఠా గుట్టురట్టు!



ఎనిమిది మంది ముఠా సభ్యుల అరెస్ట్
రూ.3.71 కోట్ల అక్రమ నగదు ఫ్రీజ్
రూ.1.5 కోట్ల స్మాక్ స్వాధీనం
ఫరీదాబాద్ కేంద్రంగా డ్రగ్స్ దందా
విద్యార్థులు, యువతే ముఠా టార్గెట్
డ్రగ్స్ రవాణా వాహనాలు సీజ్

ఎల్‌నినోపై సర్కార్ అలర్ట్!



ఆరుగురు మంత్రులతో కేబినెట్ సబ్‌కమిటీ
భట్టి విక్రమార్కకు కమిటీ చైర్మన్ బాధ్యతలు
ఐదుగురు మంత్రులకు సభ్యులుగా అవకాశం
సీఎం సలహాదారుకు ప్రత్యేక ఆహ్వానం
కరువు పరిస్థితులపై నిరంతర పర్యవేక్షణ
శాఖలకు మార్గదర్శకాలు జారీ చేయనున్న కమిటీ
కేంద్రానికి నివేదికలు.. ప్రభుత్వానికి సిఫార్సులు

న్యూస్ డెస్క్, 19 అక్టోబర్ (ఇది కద నిజం):
రాష్ట్రంలో కరువు, ఎల్‌నినో పరిస్థితులను సమీక్షించి వాటిని ఎదుర్కొనేందుకు తగిన చర్యలు మరియు సిఫార్సులు చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఎల్‌నినో పరిస్థితులపై కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేసింది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను చైర్మన్?గా మరో మరో ఐదుగురు మంత్రులతో కూడిన కమిటీని ఏర్పాటు చేస్తూ సోమవారం సీఎస్ సంజయ్ జాజు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కమిటీలో సభ్యులుగా మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు, వాకిటి శ్రీహరిలను నియమించింది.

ప్రత్యేక ఆహ్వానితులుగా సీఎం సలహాదారు:
ముఖ్యమంత్రి సలహాదారు కే.రామకృష్ణారావు ఈ కమిటీలో ప్రత్యేక ఆహ్వానితుడిగా వ్యవహరిస్తూ, ఎప్పటికప్పుడు పరిస్థితులపై సమన్వయం నిర్వహిస్తారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రణాళికా శాఖ కార్యదర్శి ఈ కమిటీకి కన్వీనర్‌గా వ్యవహరించనున్నారు. ఈ కేబినెట్ సబ్‌కమిటీ రాష్ట్రంలోని కరువు, ఎల్‌నినో పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ, సంబంధిత శాఖలకు అవసరమైన మార్గదర్శకాలు జారీ చేస్తుంది. అలాగే ఎల్‌నినో పరిస్థితులను ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రభుత్వానికి ఎప్పటికప్పుడు సిఫార్సులు అందించడంతో పాటు, కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సిన అంశాలపై నివేదికలను సమర్పించనుంది.

పండుగ వేళ పోలీసు శాఖలో కుదుపు!

హైదరాబాద్‌లో 75 మంది ఎస్సైల బదిలీ
ఎస్సైల బదిలీలతో పోలీస్ శాఖలో కుదుపు
ఉత్తర్వులు జారీ చేసిన సీపీ సజ్జనార్
పలు విభాగాలకు ఎస్సైల మార్పు
లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్‌పై ఫోకస్
వెంటనే బాధ్యతలు చేపట్టాలని ఆదేశం
నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

2 లో

తమిళనాడులో మరో కొత్త పార్టీ!



తమిళనాడులో కొత్త పార్టీకి అన్నామలై సిద్ధం
త్వరలోనే సొంత పార్టీ ప్రకటన
బీజేపీ అధ్యక్ష పదవికి గతంలో రాజీనామా
'వి ది లీడర్స్'తో సామాజిక ఉద్యమం
డ్రగ్స్ వ్యతిరేక ప్రచారంపై ప్రత్యేక దృష్టి
పర్యావరణ పరిరక్షణకు విస్తృత కార్యక్రమాలు
స్థానిక ఎన్నికల్లో అభ్యర్థుల బరిలోకి
తమిళ రాజకీయాల్లో కొత్త సమీకరణాలపై ఆసక్తి

న్యూస్ డెస్క్, 19 అక్టోబర్ (ఇది కద నిజం):
తమిళనాడు బీజేపీ మాజీ అధ్యక్షుడు, 'కర్ణాటక సింఘం'గా పేరుగాంచిన కే. అన్నామలై రాష్ట్ర రాజకీయాల్లో సంచలన ప్రకటన చేశారు. త్వరలోనే తాను స్వయంగా కొత్త రాజకీయ పార్టీని ఏర్పాటు చేయబోతున్నట్లు స్పష్టం చేశారు. ఈ ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఆయన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. తాజాగా పళనిలో జరిగిన ఒక కార్యక్రమంలో తన రాజకీయ భవిష్యత్తు గురించి మాట్లాడుతూ.. త్వరలోనే సొంత పార్టీని ప్రారంభిస్తానని అధికారికంగా వెల్లడించారు.

రాజకీయాల్లోకి రాకముందు 2011 బ్యాచ్‌కు చెందిన కర్ణాటక క్యాడర్ ఐపీఎస్ అధికారిగా పనిచేసిన అన్నామలై, తన నిర్ణయాలు, నిజాయితీ కారణంగా ప్రజల్లో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు.

ఓటుకు రూ.4 వేలు ఇవ్వాలి: వైసీపీ నేత!

రాచమల్లు వ్యాఖ్యలతో ఏపీలో దుమారం
టీడీపీ రూ.2 వేలు.. వైసీపీ రూ.2 వేలు
ఏకగ్రీవాలతో నగదు అందడం లేదంటూ వ్యాఖ్యలు
ఇంట్లో నలుగురు ఓటర్లకు రూ.16 వేల ఆశ
ప్రజలకు డబ్బులు చెల్లించాలని డిమాండ్
రాచమల్లుపై చర్యలకు కూటమి నేతల డిమాండ్

2 లో

గాంధీ, నెహ్రూ నాయకత్వం వద్దు: ఒవైసీ!

ముస్లింలు ఎవరికీ బానిసలు కారు
మన సమాజం నుంచే నాయకులు రావాలి
ఇతర పార్టీల వెనుక నడవాల్సిన అవసరం లేదు
ముస్లింలను ఓటు బ్యాంకులుగా వాడుకుంటున్నారు
యువతకు రాజకీయ వేదిక కల్పించాలి
సొంత నాయకత్వాన్ని నిర్మించుకోవాలని పిలుపు
ఒవైసీ వ్యాఖ్యలతో రాజకీయ దుమారం

2 లో



దసరా పర్వదిన సందర్భంగా
నేడు మా కార్యాలయానికి సెలవు
కావున రేపటి సంచిక వెలువడదు
పునఃదర్శనం తిరిగి గురువారం(22-10-2026)
-ఎడిటర్

సీజేపీ నేతల కేసులో కొత్త మలుపు!



మెజిస్ట్రేట్‌కు హత్య బెదిరింపు మెసేజ్
సీజేపీ నేతల బెయిల్‌పై ఉత్కంఠ
బెదిరింపులపై ఢిల్లీ పోలీసుల దర్యాప్తు
బెయిల్ అడ్డుకునేందుకే కుట్ర: సీజేపీ
విచారణకు ఆలస్యం చేశారని ఆరోపణలు
సాయంత్రం వరకు కోర్టుకు రాలేదని విమర్శ
నాలుగు రోజుల తర్వాత ప్రాసిక్యూటర్ హాజరు



కాళేశ్వరం నీళ్లపై కదనభేరి

న్యూస్ డెస్క్, 19 అక్టోబర్ (ఇది కద నిజం):
కాళేశ్వరం ప్రాజెక్టులోని కన్నెపల్లి పంపుహౌస్‌ను తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) చీఫ్ కల్వకుంట్ల కవిత సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ ప్రవహిస్తున్న గోదావరి నీటిని పరిశీలించిన ఆమె.. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా రైతులకు నీరందించే అంశంపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీశారు. కరువు పరిస్థితుల్లోనూ నీటిని వినియోగించుకునే అవకాశం ఉన్నప్పటికీ ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. రైతులకు సాగునీరు అందించడంలో నిర్లక్ష్యం చేస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు.

మిగతాది 2 లో..

- రైతులకు నీరివ్వకుంటే సహించేది లేదు!
- రేవంత్ సర్కారుకు కవిత స్ట్రాంగ్ వార్నింగ్
- కరువులోనూ గోదావరి నీరు..ఎందుకు ఎత్తిపోయరు?
- 93 మీటర్ల కాపర్ డ్యామ్ నిర్మించండి
- మేడిగడ్డతో పనిలేకుండా నీటిని లిఫ్ట్ చేయొచ్చు
- సాగునీటిపై నిర్లక్ష్యం.. రైతులకు అన్యాయం
- కాళేశ్వరంపై మరో రూ.50 వేల కోట్లు
- తుపాకులగూడెం నుంచే అనుసంధానం
- రైతుల కోసం పోరాటం ఆగదు..

ఏపీ మున్సిపల్ బరిలో భారీ నామినేషన్లు!



న్యూస్ డెస్క్, 19 అక్టోబర్ (ఇది కద నిజం):
ఆంధ్రప్రదేశ్ స్థానిక ఎన్నికల సమయంలో కొన్ని ఘటనలు జరిగినా.. పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలకు భారీ సంఖ్యలో నామినేషన్లు దాఖలయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 3,942 వార్డు స్థానాలకు 24,451 నామినేషన్లు అందాయి. మేయర్, చైర్‌పర్సన్ పదవులకు కలిపి 1,358 నామినేషన్లు దాఖలయ్యాయి. అక్టోబర్ 18న నామినేషన్ల దాఖలుకు చివరి రోజు కావడంతో అభ్యర్థులు పెద్ద సంఖ్యలో తమ నామినేషన్లను సమర్పించారు. ఇక, చివరి రోజైన అక్టోబర్ 18న ఒక్కరోజే మేయర్, చైర్‌పర్సన్ పదవులకు 1,009 నామినేషన్లు దాఖలయ్యాయి.

హైదరాబాద్‌లో భారీ అగ్నిప్రమాదం!

మదీనా క్రాస్‌రోడ్డులో చెలరేగిన మంటలు
బట్టల గోడౌన్‌లో ఒక్కసారిగా అగ్నికీలలు
దట్టమైన పొగలతో స్థానికుల్లో భయాందోళనలు
ఐదు ఫైరింజన్లతో మంటల అదుపునకు యత్నం
ఘటనతో రహదారిపై ట్రాఫిక్ అంతరాయం
ఆస్తి నష్టంపై అధికారుల ఆరా



న్యూస్ డెస్క్, 19 అక్టోబర్ (ఇది కద నిజం):
దసరా పండుగ వేళ హైదరాబాద్‌లోని రద్దీ ప్రాంతమైన మదీనా క్రాస్‌రోడ్డు సమీపంలో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఓ బట్టల దుకాణానికి చెందిన గోడౌన్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో ఆ ప్రాంతమంతా దట్టమైన పొగలు వ్యాపించాయి. దీంతో స్థానిక వ్యాపారులు, ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. మంటలు వేగంగా వ్యాపించడంతో ఏం జరుగుతుందో తెలియక పలువురు ప్రాణభయంతో అక్కడి నుంచి పరుగులు తీశారు.

మదీనా క్రాస్‌రోడ్డు పరిసరాల్లోని బట్టల గోడౌన్‌లో ఉదయం సమయంలో అగ్నిప్రమాదం సంభవించింది.

Registered No : APTEL/25/A0818

ఇది కద నిజం

మంగళవారం 20-10-2026

ఏపీ మున్సిపల్ బరిలో భారీ నామినేషన్లు!

మొదటి పేజీ తరువాయి



అదే రోజు వార్డు సభ్యుల స్థానాలకు ఏకంగా 16,282 నామినేషన్లు అందాయి. దీంతో చివరి రోజు నామినేషన్ల కేంద్రాల వద్ద అభ్యర్థుల సందడి నెలకొంది.

కార్పొరేషన్లలో మేయర్ పదవులకు 320 నామినేషన్లు దాఖలు కాగా, మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో చైర్‌పర్సన్ పదవులకు 1,038 నామినేషన్లు వచ్చాయి. వార్డు స్థానాల విషయానికి వస్తే, కార్పొరేషన్లలో 8,198 నామినేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో 16,253 నామినేషన్లు దాఖలయ్యాయి. ఇక, మేయర్, చైర్‌పర్సన్ పదవులకు పార్టీలవారీగా వచ్చిన నామినేషన్లలో వైఎస్సార్‌సీపీ నుంచి 367, తెలుగుదేశం పార్టీ నుంచి 329, కాంగ్రెస్ నుంచి 117, జనసేన నుంచి 100 నామినేషన్లు అందాయి. స్వతంత్ర అభ్యర్థుల నుంచి 287, ఇతర పార్టీల నుంచి 158 నామినేషన్లు దాఖలయ్యాయి.

వార్డు సభ్యుల స్థానాలకు తెలుగుదేశం పార్టీ నుంచి అత్యధికంగా 9,460 నామినేషన్లు వచ్చినట్లు వివరాలు వెల్లడిస్తున్నాయి. వైఎస్సార్‌సీపీ నుంచి 8,175, జనసేన నుంచి 2,324, కాంగ్రెస్ నుంచి 416 నామినేషన్లు దాఖలయ్యాయి. స్వతంత్ర అభ్యర్థుల నుంచి 2,586, ఇతర పార్టీల నుంచి 1,490 నామినేషన్లు అందాయి. ఇదిలా ఉండగా, కడప జిల్లా మైదుకూరు మున్సిపల్ ఎన్నికల ప్రక్రియను ప్రస్తుతానికి నిలిపివేసినట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ అనిల్ చంద్ర పునేతా తెలిపారు. కడప జిల్లా కలెక్టర్ నుంచి అందిన నివేదిక ఆధారంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు. మైదుకూరు ఎన్నికలపై తదుపరి చర్యలు ఎన్నికల సంఘం ఆదేశాలకు అనుగుణంగా కొనసాగనున్నాయి.

పండుగ వేళ పోలీసు శాఖలో కుదుపు!



న్యూస్ డెస్క్, 19 అక్టోబర్ (ఇది కద నిజం): దసర పండుగల వేళ పోలీసు శాఖలో కీలక పరిణామం చోటుచేసుకుంది. హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ, అడ్మినిస్ట్రేటివ్ పనితీరును మరింత వేగవంతం చేయడంలో భాగంగా భారీగా సబ్ ఇన్‌స్పెక్టర్ల బదిలీలు జరిగాయి. కమిషనరేట్ పరిధిలోని వివిధ పోలీస్ స్టేషన్లలో పనిచేస్తున్న 75 మంది ఎస్సైలను బదిలీ చేస్తూ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ ఉత్తర్వులు జారీ చేశారు.

నగరంలో శాంతిభద్రతల నిర్వహణను మరింత కట్టుదిట్టం చేసేందుకు, అలాగే సుదీర్ఘకాలంగా ఒకేచోట విధులు నిర్వహిస్తున్న వారిని వేర్వేరు స్టేషన్లు, విభాగాలు, లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్, క్రైమ్ విభాగాలు, కంట్రోల్ రూమ్‌లకు బదిలీ చేస్తూ ఈ నిర్ణయం తీసుకున్నారు. బదిలీ అయిన స్థానాల్లో అధికారులు తక్షణమే బాధ్యతలు స్వీకరించాలని సీపీ సజ్జనార్ స్పష్టం చేశారు. బాధ్యతల స్వీకరణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. రాబోయే పండుగలు, నగరంలో పెరుగుతున్న రద్దీ, భద్రతా అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ మార్పులు చేసినట్లుగా పోలీస్ వర్గాలు వెల్లడించాయి. అయితే, ఒకేసారి 75 మంది ఎస్సైలు బదిలీ కావడం పోలీస్ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

గాంధీ, నెహ్రూ నాయకత్వం వద్దు: ఒవైసీ!



న్యూస్ డెస్క్, 19 అక్టోబర్ (ఇది కద నిజం): దేశ రాజకీయాల్లో ముస్లింలు ఎవరికీ బానిసలు కాదని, సంప్రదాయ పార్టీల వెనుక నడవాల్సిన అవసరం లేదని ఆలిండియా మజ్లిస్-ఎ-ఇత్తెహాదుల్ ముస్లిమీన్ అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ స్పష్టం చేశారు. తాజాగా ఉత్తర్ ప్రదేశ్‌లోని రాంపూర్ లో ఆయన మాట్లాడుతూ.. తమకు నెహ్రూ, గాంధీ , యాదవ్ కుటుంబాల నాయకత్వం ఇకపై అవసరం లేదని, తమ సమాజం నుంచి స్వయంగా నాయకులు ఎదుగుతారని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇంకెన్నాళ్లు ఇతర పార్టీల నాయకుల వెనుక తిరుగుతూ, వారిని నెహ్రూలు, గాంధీలుగా భావించి మద్దతు ఇవ్వాలని కొందరు మనవారే చెబుతున్నారని కామెంట్ చేశారు. 'అలాంటి వారికి, ఒవైసీకి తేడా ఇదే; వాళ్లు ఇతరులను సమర్థించమంటారు, కానీ నేను మాత్రం మీరే నాయకులు కండి అంటాను' అని అసదుద్దీన్ ఒవైసీ తేల్చిచెప్పారు.

ముస్లిం యువతీ యువకులకు ఇతర వర్గాలవారితో సమానంగా అపారమైన సామర్థ్యం, ప్రతిభ ఉందని, అయితే ప్రధాన రాజకీయ పార్టీలు వారిని కేవలం ఓటు బ్యాంకులుగా వాడుకుంటున్నాయే తప్ప సరైన వేదిక కల్పించడం లేదని అసదుద్దీన్ ఒవైసీ ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో అణగారిన వర్గాల గొంతు వినిపించేందుకు, ముస్లిం యువతకు రాజకీయ వేదికను అందించేందుకే తమ పార్టీ నిరంతరం పనిచేస్తూనే ఉందని పేర్కొన్నారు. యువత ఎవరిపై ఆధారపడకుండా తమ సొంత నాయకత్వాన్ని నిర్మించుకోవాలని పిలుపునిచ్చారు. అయితే, దేశంలోని ప్రధాన పార్టీల తీరును ఎండగడుతూ ఒవైసీ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో తీవ్ర దుమారం రేపుతున్నాయి.

సీజేపీ నేతల కేసులో కొత్త మలుపు!



న్యూస్ డెస్క్, 19 అక్టోబర్ (ఇది కద నిజం): కాక్రోచ్ జనతా పార్టీ నేతలు అశుతోష్ రంకా, సౌరవ్ దాస్‌ల బెయిల్ పిటిషన్‌పై విచారణ జరుగుతున్న సమయంలో స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ కి హత్య బెదిరింపులు రావడం తీవ్ర సంచలనం సృష్టిస్తోంది. మెజిస్ట్రేట్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఢిల్లీ పోలీసులు అపరిచిత వ్యక్తులపై నాన్-కాగ్నిజబుల్ రిపోర్ట్ నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

కావాలనే ఆలస్యం చేస్తున్నారు: సీజేపీ తీవ్ర ఆరోపణలు

మెజిస్ట్రేట్‌కు వచ్చిన బెదిరింపుల నెపంతో విచారణను కావాలని పక్కదోవ పట్టించారని, తమ నేతలకు బెయిల్ రాకుండా నిరోధిస్తున్నారని సీజేపీ తీవ్రంగా మండిపడింది. ఈ పరిణామంపై సీజేపీ లీగల్ సెల్ చీఫ్ రత్నా సింగ్ స్పందిస్తూ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. తాము ఉదయం నుంచే కోర్టు వద్ద వేచి చూస్తున్నామని అన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు విచారణ జరుగుతుందని చెప్పారని పేర్కొన్నారు. వెరిఫికేషన్ ప్రక్రియతో సహా అన్ని ఫార్మాలిటీస్ పూర్తయ్యాయని.. కానీ మెజిస్ట్రేట్ సాయంత్రం 5 గంటల వరకు కోర్టు రూమ్‌లోకి రాలేదని ఆరోపించారు. బెయిల్ పిటిషన్ మెరిట్స్ ఆధారంగా విచారించకుండా, కేవలం ఆ బెదిరింపు మెసేజ్ చుట్టూనే చర్చను తిప్పారని రత్నా సింగ్ ఆరోపించారు. గత 4 రోజులుగా రాని పబ్లిక్ ప్రాసిక్యూటర్ సోమవారం అకస్మాత్తుగా రావడం, వచ్చిన కొద్దిసేపటికే మెజిస్ట్రేట్ బెదిరింపుల అంశాన్ని తేవడం వెనుక పెద్ద కుట్ర ఉందన్నారు. తమ నేతల విడుదలను అడ్డుకోవడానికే ఇదంతా ముందస్తు ప్రణాళిక ప్రకారం జరిగిందని ఆమె విమర్శించారు.

కాగా, జంతర్ మంతర్ వద్ద నిరసన తెలిపారనే ఆరోపణలతో అశుతోష్ రంకా, సౌరవ్ దాస్‌లను ఢిల్లీ పోలీసులు గత వారం అరెస్ట్ చేసి, 5 రోజుల జ్యుడీషియల్ కస్టడీకి పంపారు. వారి బెయిల్ పిటిషన్ సోమవారం విచారణకు రాగా, విచారణ ప్రారంభమైన ఐదు నిమిషాలకే తనకు చంపేస్తామంటూ ఓ మెసేజ్ వచ్చిందని మెజిస్ట్రేట్ కోర్టులో స్వయంగా వెల్లడించడం హాట్ టాపిక్‌గా మారింది.

ఢిల్లీలో డ్రగ్స్ ముఠా గుట్టురట్టు!



న్యూస్ డెస్క్, 19 అక్టోబర్ (ఇది కద నిజం): దేశ రాజధాని ఢిల్లీలో నార్కోటిక్స్ డ్రగ్స్ సప్లై నెట్‌వర్క్‌పై సౌత్-ఈస్ట్ జిల్లా పోలీసులు భారీ మెరుపు దాడి నిర్వహించి అంతర్రాష్ట్ర డ్రగ్స్ ముఠా గుట్టును రట్టు చేశారు. ఓఖ్లా ఇండస్ట్రియల్ ఏరియా పోలీస్ స్టేషన్‌లో ఎన్‌డీపీఎస్ చట్టం కింద నమోదైన ఎఫ్ఐఆర్ నం. 225/2026 కేసు దర్యాప్తులో పోలీసులకు సంచలన పురోగతి లభించింది. ఈ డ్రగ్స్ దందా ద్వారా అక్రమంగా ఆర్జించిన సుమారు రూ. 3,71,98,560 నగదు నిల్వలను చట్టపరమైన ఉత్తర్వుల ద్వారా ఢిల్లీ పోలీసులు విజయవంతంగా ఫ్రీజ్ చేయించారు. తొలుత స్థానిక పెడ్లర్లను అదుపులోకి తీసుకుని విచారించగా, ఈ నెట్‌వర్క్ వెనుక హర్యానాలోని ఫరీదాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న కీలక సరఫరాదారులు, భారీ స్టాకిస్టులు, మధ్యవర్తుల లింకులు ఒక్కొక్కటిగా బయటపడ్డాయి. ఈ ఆపరేషన్‌లో భాగంగా ముఠా సభ్యుల నుంచి మార్కెట్లో సుమారు రూ. 1.5 కోట్ల విలువైన 1.383 కిలోల స్వచ్ఛమైన 'స్మాక్' మత్తుపదార్థాన్ని స్వాధీనం చేసుకున్నారు.

ఈ కేసులో సమగ్ర దర్యాప్తు అనంతరం పోలీసులు మొత్తం ఎనిమిది మంది ప్రధాన నిందితులను అరెస్ట్ చేశారు. పట్టుబడిన వారిలో కిరణ్ అలియాస్ రామ్ ప్రసాద్, నీరజ్ అలియాస్ థాపా, అశోక్ అలియాస్ రాము, మనియా అలియాస్ సుమన్ పాఠక్, విక్కీ గుడ్డు, సునీత్ అలియాస్ నన్హే మరియు గోపీ సింగ్‌లుగా అధికారులు గుర్తించారు. ఢిల్లీ-ఎన్‌సీఆర్ ప్రాంతంలో పాఠశాలలు, కళాశాల విద్యార్థులు, యువతను లక్ష్యంగా చేసుకుని ఈ ముఠా పెద్ద ఎత్తున మాదకద్రవ్యాల వ్యాపారం సాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. డ్రగ్స్ రవాణాకు ఉపయోగించిన వాహనాలు, ఇతర సాంకేతిక పరికరాలను సీజ్ చేయడంతో పాటు, ఈ నెట్‌వర్క్‌తో సంబంధాలున్న ఇతర కీలక సూత్రధారుల కోసం ప్రత్యేక బృందాలు గాలింపు ముమ్మరం చేశాయి.

ఓటుకు రూ.4 వేలు ఇవ్వాలి: వైసీపీ నేత!



న్యూస్ డెస్క్, 19 అక్టోబర్ (ఇది కద నిజం): ఆంధ్రప్రదేశ్‌లో మున్సిపల్, స్థానిక సంస్థల ఎన్నికల వేళ వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో పెను దుమారం రేపుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ స్థానిక ఎన్నికల్లో బలవంతపు ఏకగ్రీవాలు చేయిస్తోందని, దీని వల్ల సామాన్య ప్రజలకు ఎన్నికల సమయంలో అందాల్సిన డబ్బులు దక్కకుండా పోతున్నాయని వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ప్రొద్దుటూరులో మీడియాతో మాట్లాడిన ఆయన.. సాధారణంగా ఎన్నికలు జరిగితే అధికార టీడీపీ రూ. 2 వేలు, తాము (వైసీపీ) రూ. 2 వేలు ఓటర్లకు పంచేవారమని నిస్సంకోచంగా వ్యాఖ్యానించారు. ఇంట్లో నలుగురు ఓటర్లు ఉంటే పండుగ పూట కనీసం రూ. 16 వేల వరకు నగదు వస్తుందని సామాన్య ప్రజలు ఆశగా ఎదురుచూశారని, కానీ ఏకగ్రీవాల పేరుతో ఆ అవకాశాన్ని లేకుండా చేశారని చెప్పడం తీవ్ర దుమారం రేపుతోంది.

అలాగే ప్రజలకు చేరవలసిన ఆ డబ్బులను కూటమి ప్రభుత్వమే నేరుగా అందించాలని రాచమల్లు డిమాండ్ చేశారు. పోటీ లేకుండా ఏకగ్రీవాలు చేసుకున్నందుకు గాను, తామిచ్చే రూ. 2 వేలు, టీడీపీ ఇచ్చే రూ. 2 వేలు కలిపి మొత్తం రూ. 4 వేలను టీడీపీ నేతలే ప్రజల ఇళ్లకు వెళ్లి చెల్లించాలని చెప్పడం ప్రస్తుతం ఏపీ రాజకీయాల్లో సంచలనంగా మారింది. ఎన్నికల్లో ఓటర్లకు డబ్బుల పంపిణీని బాహాటంగా సమర్థిస్తూ, పరోక్షంగా ఓట్లకు నోట్ల సంస్కృతిని ప్రస్తావిస్తూ ఓ మాజీ ప్రజా ప్రతినిధి బహిరంగంగా ఇలాంటి వ్యాఖ్యలు చేయడం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. రాచమల్లు చేసిన ఈ వ్యాఖ్యలపై అధికార కూటమి నేతలు తీవ్రస్థాయిలో మండిపడుతూ, ఎన్నికల నియమావళిని ఉల్లంఘించేలా మాట్లాడినందుకు ఆయనపై ఎన్నికల సంఘం సుమోటోగా కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

కిలావుయా 55వ విస్ఫోటనం!



న్యూస్ డెస్క్, 19 అక్టోబర్ (ఇది కద నిజం): అమెరికాలోని హవాయి ద్వీపంలోని క్రియాశీల అగ్నిపర్వతం కిలావుయా మరోసారి విస్ఫోటనం చెందింది. అక్టోబర్ 17న జరిగిన విస్ఫోటనంలో లావా ఫౌంటెన్లు ఎగిసిపడ్డాయి. సుమారు 700 అడుగుల ఎత్తు వరకు లావా ఎగిసిపడింది. 2024 డిసెంబర్ నుంచి గత 22 నెలల వ్యవధిలో ఇది 55వ సారి విస్ఫోటనం చెందడం.

హవాయిలోని వోల్కనోస్ నేషనల్ పార్క్‌లో ఉన్న కిలావుయా అగ్నిపర్వతం ఉత్తర బిలం వద్ద స్థానిక కాలమానం ప్రకారం.. తెల్లవారుజామున 3.19 గంటలకు లావా బయటకు రావడం ప్రారంభమైంది. ఉదయం 5 గంటల సమయానికి బయటకు రావడం తీవ్రమైంది. ఈ ప్రక్రియ సుమారు 6 గంటల పాటు కొనసాగి ఉదయం 9 గంటలకు ముగిసింది. అగ్నిపర్వతం పేలుడు ధాటికి ఎగిసిపడిన బూడిద మేఘం సుమారు 25,000 అడుగుల ఎత్తుకు చేరింది.

చివరిసారిగా దాదాపు 2 నెలల క్రితం మళ్లీ కిలావుయా విస్ఫోటనం చెందింది. చివరిసారిగా ఆగస్టు 25న ఇది జరిగింది. తాజా విస్ఫోటనం మొత్తం హలేమా ఉమాఉ అగ్ని పర్వత బిలానికి మాత్రమే పరిమితం కావడంతో చుట్టుపక్కట ప్రాంతాలకు పెద్దగా ప్రమాదం జరగలేదు. కిలావుయా ప్రపంచంలో క్రియాశీలకంగా ఉన్న అగ్నిపర్వతాల్లోఒకటి.

ఎల్‌నినోపై సర్కార్ అలర్ట్!



న్యూస్ డెస్క్, 19 అక్టోబర్ (ఇది కద నిజం): రాష్ట్రంలో కరువు, ఎల్‌నినో పరిస్థితులను సమీక్షించి వాటిని ఎదుర్కొనేందుకు తగిన చర్యలు మరియు సిఫార్సులు చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఎల్‌నినో పరిస్థితులపై కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేసింది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను చైర్మన్ గా మరో మరో ఐదుగురు మంత్రులతో కూడిన కమిటీని ఏర్పాటు చేస్తూ సోమవారం సీఎస్ సంజయ్ జాజు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కమిటీలో సభ్యులుగా మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు, వాకిటి శ్రీహరిలను నియమించింది.

ప్రత్యేక ఆహ్వానితులుగా సీఎం సలహాదారు:

ముఖ్యమంత్రి సలహాదారు కే.రామకృష్ణారావు ఈ కమిటీలో ప్రత్యేక ఆహ్వానితుడిగా వ్యవహరిస్తూ, ఎప్పటికప్పుడు పరిస్థితులపై సమన్వయం నిర్వహిస్తారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రణాళికా శాఖ కార్యదర్శి ఈ కమిటీకి కన్వీనర్‌గా వ్యవహరించనున్నారు. ఈ కేబినెట్ సబ్‌కమిటీ రాష్ట్రంలోని కరువు, ఎల్‌నినో పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ, సంబంధిత శాఖలకు అవసరమైన మార్గదర్శకాలు జారీ చేస్తుంది. అలాగే ఎల్‌నినో పరిస్థితులను ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రభుత్వానికి ఎప్పటికప్పుడు సిఫార్సులు అందించడంతో పాటు, కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సిన అంశాలపై నివేదికలను సమర్పించనుంది.

తమిళనాడులో మరో కొత్త పార్టీ!



న్యూస్ డెస్క్, 19 అక్టోబర్ (ఇది కద నిజం): తమిళనాడు బీజేపీ మాజీ అధ్యక్షుడు, 'కర్ణాటక సింఘం'గా పేరుగాంచిన కే. అన్నామలై రాష్ట్ర రాజకీయాల్లో సంచలన ప్రకటన చేశారు. త్వరలోనే తాను స్వయంగా కొత్త రాజకీయ పార్టీని ఏర్పాటు చేయబోతున్నట్లు స్పష్టం చేశారు. ఈ ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఆయన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. తాజాగా పళనిలో జరిగిన ఒక కార్యక్రమంలో తన రాజకీయ భవిష్యత్తు గురించి మాట్లాడుతూ.. త్వరలోనే సొంత పార్టీని ప్రారంభిస్తానని అధికారికంగా వెల్లడించారు.

రాజకీయాల్లోకి రాకముందు 2011 బ్యాచ్‌కు చెందిన కర్ణాటక క్యాడర్ ఐపీఎస్ అధికారిగా పనిచేసిన అన్నామలై, తన నిర్ణయాలు, నిజాయితీ కారణంగా ప్రజల్లో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. తన సర్వీస్‌కు రాజీనామా చేసిన అనంతరం ఆయన బీజేపీలో చేరి, తమిళనాడులో పార్టీ బలోపేతానికి ఎంతో కృషి చేశారు. అయితే ఇటీవల పార్టీ పదవిని వీడిన ఆయన, ప్రస్తుతం ప్రజా సమస్యలపై దృష్టి సారించారు. ఇందులో భాగంగానే 'వి ది లీడర్స్' పేరుతో ఒక నూతన సామాజిక ఉద్యమానికి శ్రీకారం చుట్టారు.

ప్రస్తుతం ఈ ఉద్యమం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా వివిధ జనహిత కార్యక్రమాలను ఆయన ముందుకు తీసుకువెళుతున్నారు. ముఖ్యంగా డ్రగ్స్‌కు వ్యతిరేకంగా అవగాహన కల్పించడం, పర్యావరణ పరిరక్షణ వంటి సామాజిక అంశాలపై ఆయన బృందం విస్తృతంగా ప్రచారాలు నిర్వహిస్తోంది. అంతేకాకుండా, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో 'వి ది లీడర్స్' వేదిక తరఫున అభ్యర్థులను బరిలోకి దించి ఎన్నికల్లో పోటీ చేయనున్నట్లు ప్రకటించారు.

అన్నామలై తీసుకున్న ఈ సరికొత్త నిర్ణయం తమిళనాడు రాజకీయ సమీకరణాలపై ప్రభావం చూపే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ద్రవిడ పార్టీల ఆధిపత్యం ఉండే తమిళ రాజకీయాల్లో ఒక మాజీ ఐపీఎస్ అధికారి, ప్రజా ఉద్యమాల ద్వారా సొంత పార్టీని స్థాపించి ముందుకు వెళ్లడం ప్రాధాన్యత సంతరించుకుంది. రాబోయే కాలంలో ఆయన పార్టీ ఎలాంటి ప్రభావం చూపుతుందనేది ఆసక్తికరంగా మారింది.

హైదరాబాద్‌లో భారీ అగ్నిప్రమాదం!



న్యూస్ డెస్క్, 19 అక్టోబర్ (ఇది కద నిజం): దసరా పండుగ వేళ హైదరాబాద్‌లోని రద్దీ ప్రాంతమైన మదీనా క్రాస్‌రోడ్డు సమీపంలో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఓ బట్టల దుకాణానికి చెందిన గోడౌన్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో ఆ ప్రాంతమంతా దట్టమైన పొగలు వ్యాపించాయి. దీంతో స్థానిక వ్యాపారులు, ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. మంటలు వేగంగా వ్యాపించడంతో ఏం జరుగుతుందో తెలియక పలువురు ప్రాణభయంతో అక్కడి నుంచి పరుగులు తీశారు.

మదీనా క్రాస్‌రోడ్డు పరిసరాల్లోని బట్టల గోడౌన్‌లో ఉదయం సమయంలో అగ్నిప్రమాదం సంభవించింది. గోడౌన్‌లో పెద్ద మొత్తంలో దుస్తులు, ఇతర వస్తువులు ఉండటంతో మంటలు త్వరగా వ్యాపించి భారీగా ఎగిసిపడ్డాయి. దట్టమైన పొగలు పరిసర ప్రాంతాలను కమ్ముకోవడంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. పండుగ సమయంలో వ్యాపార కార్యకలాపాలు, ప్రజల రాకపోకలతో రద్దీగా ఉండే ప్రాంతంలో ఈ ఘటన జరగడంతో అక్కడ కొంతసేపు గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి.

ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. దీంతో ఫైర్ సిబ్బంది ఐదు ఫైరింజన్లతో ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. మంటలు మరింత విస్తరించకుండా చర్యలు చేపట్టారు. గోడౌన్‌లో నిల్వ ఉన్న వస్తువులు మంటలకు ఆహుతయ్యే అవకాశం ఉండటంతో అగ్నిమాపక సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. ప్రమాదానికి గల కారణాలు ఏంటన్నది ఇంకా స్పష్టత రావాల్సి ఉంది.

మరోవైపు, అగ్నిప్రమాదాన్ని చూసేందుకు స్థానికులు, ప్రజలు పెద్ద సంఖ్యలో రోడ్లపైకి రావడంతో ఆ ప్రాంతంలో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వాహనాలు నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అత్యవసర సేవలకు ఆటంకం కలగకుండా ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ ఘటనలో ఎంత మేర ఆస్తి నష్టం జరగ్గా.. పూర్తి వివరాలు ఇంకా తెలియరాలేదు. ప్రాణనష్టం జరిగిందా లేదా అన్న విషయంపై కూడా అధికారిక సమాచారం వెల్లడికావాల్సి ఉంది. ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు, పోలీసులు ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరిస్తున్నారు. మంటలు పూర్తిగా అదుపులోకి వచ్చిన తర్వాతే నష్టంపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

కాళేశ్వరం నీళ్లపై కదనభేరి

మొదటి పేజీ తరువాయి



కరువు కాలంలోనూ సుమారు 2 టీఎంసీల నీరు అందుబాటులో ఉంటుందని కవిత పేర్కొన్నారు. 93 మీటర్ల పొడవునా కాపర్ డ్యామ్ నిర్మిస్తే మేడిగడ్డ బ్యారేజీపై ఆధారపడకుండా నీటిని లిఫ్ట్ చేసే అవకాశం ఉంటుందని ఆమె వివరించారు. ఈ ప్రతిపాదనను ప్రభుత్వం వెంటనే పరిశీలించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం దృష్టి సారించడం లేదని ఆరోపించారు. ప్రభుత్వానికి చేతులు జోడించి విజ్ఞప్తి చేస్తున్నానని, వెంటనే కాపర్ డ్యామ్ నిర్మాణం చేపట్టాలని కోరారు. ఈ విజ్ఞప్తిని పట్టించుకోకపోతే తదుపరి కార్యాచరణ చేపడతామని హెచ్చరించారు. రైతులకు విద్యుత్తు సరఫరా చేయకుండా, అందుబాటులో ఉన్న నీటిని ఎత్తిపోసి సాగుకు వినియోగించకుండా నష్టం కలిగిస్తే సహించబోమని కవిత స్పష్టం చేశారు. రైతాంగ ప్రయోజనాల కోసం ప్రభుత్వంపై నిరంతరం పోరాటం కొనసాగిస్తామని చెప్పారు. తమ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు సంపూర్ణ మేలు చేసేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా లక్ష ఎకరాల కొత్త ఆయకట్టు ఏర్పడిందని కవిత తెలిపారు. ఇప్పటివరకు ఈ ప్రాజెక్టుపై రూ.93 వేల కోట్లు ఖర్చు చేశారని, ఆయకట్టు లక్ష్యాన్ని పూర్తిగా సాధించేందుకు మరో రూ.50 వేల కోట్లు అవసరమవుతాయని ఆమె పేర్కొన్నారు. కరువు పరిస్థితుల నేపథ్యంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాల పనితీరు ప్రజలకు స్పష్టమవుతోందని వ్యాఖ్యానించారు. అయితే, ప్రాజెక్టు వ్యయం, ఆయకట్టు లక్ష్యాలు, అదనపు నిధుల అవసరంపై ఆమె చేసిన వ్యాఖ్యలు రాజకీయ నాయకురాలిగా ఆమె వెల్లడించిన వివరాలుగా పరిగణించాలి.

గోదావరి-కావేరి నదుల అనుసంధానంపైనా కవిత కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ అనుసంధానాన్ని పోలవరం నుంచి చేపట్టేందుకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. విజయవాడలో తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్‌తోనూ ఈ అంశంపై చర్చించినట్లు గుర్తుచేశారు. అయితే, తుపాకులగూడెం నుంచి గోదావరి-కావేరి అనుసంధానం చేపడితేనే తెలంగాణకు ఎక్కువ ప్రయోజనం కలుగుతుందని కవిత అభిప్రాయపడ్డారు. ఈ దిశగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం నీటి వినియోగం, కాపర్ డ్యామ్ నిర్మాణం, నదుల అనుసంధానంపై ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయాలు తీసుకోవాలని ఆమె కోరారు.

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
మంగళవారం 20-10-2026

వెంకట సాయి నగర్‌లో ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణే లక్ష్యం
మహిళల ఆటపాటలతో మార్మోగిన వెంకట సాయి నగర్ కాలనీ





ఇది కద నిజం,రామంతాపూర్: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ వేడుకలను వెంకట సాయి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు వెంకట సాయి నగర్‌తో పాటు పరిసర ప్రాంతాల్లోని వివిధ కాలనీల నుంచి మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై ఉత్సాహంగా పాల్గొన్నారు. రంగురంగుల పూలతో అలంకరించిన బతుకమ్మలు, మహిళల సంప్రదాయ ఆటపాటలు, బతుకమ్మ పాటలతో వేడుకల ప్రాంగణం సందడిగా మారింది. ఈ సందర్భంగా మహిళలు వివిధ రకాల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించారు. అనంతరం బతుకమ్మల చుట్టూ చేరి సంప్రదాయ పాటలు పాడుతూ, కోలాటాలు, ఆటపాటలతో సంబరాలు జరుపుకున్నారు. వివిధ కాలనీలకు చెందిన మహిళలు ఒకచోట చేరి పండుగను జరుపుకోవడంతో ఆ ప్రాంతంలో పండుగ వాతావరణం నెలకొంది. వెంకట సాయి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ, బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, ప్రకృతి ఆరాధనకు, సాంస్కృతిక వారసత్వానికి ప్రతీక అని పేర్కొన్నారు. ఇటువంటి వేడుకలు మహిళల మధ్య ఐక్యతను పెంపొందించడంతో పాటు, మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించేందుకు దోహదపడతాయని తెలిపారు. వివిధ కాలనీల మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొనడం సంతోషంగా ఉందని, ప్రజల మధ్య స్నేహభావం, సామాజిక సమైక్యతను పెంపొందించే కార్యక్రమాలకు తమ అసోసియేషన్ ప్రాధాన్యత ఇస్తుందని పేర్కొన్నారు. వెంకట సాయి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో స్థానిక మహిళలు, వివిధ కాలనీల ప్రతినిధులు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు. సంప్రదాయాల పరిరక్షణతో పాటు మహిళల ఐక్యతను చాటిచెప్పిన సద్దుల బతుకమ్మ సంబరాలు ఉత్సాహభరిత వాతావరణంలో ముగిశాయి.

సినీ దర్శకుడు తుకారంకు ఘన సన్మానం





ఇది కద నిజం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా పిట్లం: దసరా, బతుకమ్మ పండుగల సందర్భంగా స్వగ్రామమైన కామారెడ్డి జిల్లా పిట్లం మండల కేంద్రానికి విచ్చేసిన కాగితం పడవలు సినిమా దర్శకుడు తుకారంను శాంతినగర్ కాలనీలో కుమ్మరి శాలివాహన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా దర్శకుడు తుకారంను శాలువాతో సత్కరించి, సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బీసీ రాజ్యాధికార సమితి కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు కుమ్మరి హనుమంతరావు, యాదగిరి, కుమ్మరి సంఘం ప్రతినిధులు, శంకర్ విటల్ చిన్న రాములు రమేష్ కార్తీక్ శివ రత్నం గంగ ప్రసాద్ నారాయణ తదితరులు పాల్గొన్నారు. స్వగ్రామానికి వచ్చిన దర్శకుడు తుకారంను సన్మానించడం పట్ల సంఘం సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు.

వైభవంగా దుర్గామాత పూజలు

- కొత్త చీరలు, రంగురంగుల గాజులతో అమ్మవారి విశేష అలంకరణలు
- భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు



ఇది కద నిజం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా: కామారెడ్డి జిల్లా పిట్లం మండలంలోని పిట్లం, గౌరారం తదితర గ్రామాల్లో శరన్నవరాత్రుల 9వ రోజు సందర్భంగా దుర్గామాతకు ప్రత్యేక పూజలు కుంకుమార్చనలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రతిరోజూ అమ్మవారిని కొత్త చీరలు, రంగురంగుల గాజులు, వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు. నవరాత్రుల్లో రోజుకో రూపంలో అమ్మవారిని అలంకరించి పూజించడం విశేషం. అష్టమి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆలయాల్లో అమ్మవారికి విశేష అలంకరణలు చేసి, పుష్పాలు, కుంకుమతో అర్చనలు పండితులు శ్యాం పంతులు నిర్వహించారు. దుర్గాదేవి మహిషాసురమర్దిని రూపంలో దుష్టశక్తులను సంహరించి, ధర్మాన్ని కాపాడిన శక్తిస్వరూపిణిగా భక్తులు ఆరాధించారు. అమ్మవారి కరుణతో కుటుంబాల్లో సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, సిరిసంపదలు కలగాలని భక్తులు ప్రార్థించారు. మరియు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మహిళలు భక్తితో కుంకుమార్చనలు నిర్వహించి అమ్మవారికి గాజులు, పూలు సమర్పించారు. ఆలయాలు భక్తుల సందడితో కళకళలాడగా, అమ్మవారి నామస్మరణతో గ్రామాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. భక్తులు కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో గౌరారం గ్రామ సర్పంచ్ లోకినేని హనుమంతరావు మరియు మహిళలు చిన్నలు పెద్దలు భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా మేడ్చల్ కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ వజ్రేష్ యాదవ్ పుట్టినరోజు వేడుకలు



ఇది కద నిజం: మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ తోటకూరి వజ్రేష్ యాదవ్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో బోడుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని మల్లయ్య నగర్ కాలనీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు చంద్రశేఖర్, కార్యవర్గ సభ్యులు ప్రత్యేకంగా పాల్గొని వజ్రేష్ యాదవ్‌కు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని వారు ఈ సందర్భంగా ఆకాంక్షించారు. ఈ శుభసందర్భంలో మల్లయ్య నగర్ కాలనీ ఎదుర్కొంటున్న పలు మౌలిక వసతుల సమస్యలను అసోసియేషన్ ప్రతినిధులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కాలనీ సమస్యల పట్ల సానుకూలంగా స్పందించిన తోటకూరి వజ్రేష్ యాదవ్, వాటిని అధిష్ఠానం మరియు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ వేడుకల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొని వజ్రేష్ యాదవ్‌కు కేక్ తినిపించి శుభాకాంక్షలు తెలియజేశారు.

అస్వస్థతకు గురైన బాధితులకు మెరుగైన వైద్యం అందించాలి





ఇది కద నిజం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా పిట్లం: అస్వస్థతకు గురైన పిట్లం మండలం అన్నవరం తాండలో ఫంక్షన్కు హాజరైన బంధువులు పాయిజన్ తో అస్వస్థతకు గురయ్యారు బాధితులను పిట్లం ఆసుపత్రికి తరలించారు. వారిని ఎమ్మార్వో మహేందర్, పిట్లం సర్పంచ్ కుమ్మరి చంద్రశేఖర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రామ్‌రెడ్డి పరిశీలించి, వారి ఆరోగ్య పరిస్థితిపై ఆసుపత్రి సూపర్డెంట్ రవీంద్ర మోహన్ తో మాట్లాడి ఆరోగ్య పరిస్థితితో ఆరా తీశారు. బాధితులను మెరుగైన వైద్య చికిత్స అందించాలని సూచించారు. బాధితులకు అవసరమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

గౌరారం గ్రామ ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జూపాల శంకర్



ఇది కద నిజం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా గౌరారం: కామారెడ్డి జిల్లా పిట్లం మండలంలోని గౌరారం గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జూపాల శంకర్ గ్రామ ప్రజలందరికీ విజయదశమి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే దసరా పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం నింపాలని ఆకాంక్షించారు. గ్రామ ప్రజలందరూ దసరా పండుగను కుటుంబ సభ్యులతో కలిసి ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని, గ్రామంలో ఐకమత్యం, సోదరభావం, ప్రశాంత వాతావరణం వెల్లివిరియాలని జూపాల శంకర్ ఆకాంక్షించారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో వర్ధిల్లాలని కోరుకుంటూ గ్రామ ప్రజలకు మరోసారి దసరా శుభాకాంక్షలు తెలియజేశారు.

యాదగిరిగుట్టలో భక్తిశ్రద్ధలతో ఎస్‌పీఎఫ్ ఆయుధ పూజ





ఇది కద నిజం,యాదగిరిగుట్ట: తెలంగాణలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి సన్నిధిలో తెలంగాణ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (SPF) సిబ్బంది ఆయుధ పూజ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు వేద మంత్రోచ్చారణల మధ్య శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలను జరిపించారు. ఆలయ భద్రతను మరింత పటిష్ఠం చేయడంతో పాటు, క్షేత్రానికి వచ్చే భక్తులకు నిరంతరం మెరుగైన రక్షణ కల్పించాలనే సంకల్పంతో ఎస్‌పీఎఫ్ సిబ్బంది స్వామివారికి ప్రత్యేక ప్రార్థనలు చేసి ఆశీస్సులు అందుకున్నారు. ఆలయ ప్రాంగణంలో జరిగిన ఈ వేడుక ఆధ్యాత్మిక వాతావరణంలో ఉత్సాహపూరితంగా సాగింది. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి జె. భవాని శంకర్, టీజీ ఎస్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కే. శేషగిరిరావుతో పాటు ఆలయ అధికారులు, హోంగార్డులు మరియు ఎస్‌పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.



అష్టభుజ రూపిని నమో నమః.

అమరావతి ,ఇది కద నిజం సెప్టెంబర్ 19: శరన్నవరాత్రు మహోత్సవాలలో ఇంద్రకీలాద్రిపై వెలసిన దుర్గమ్మ అష్టభుజాలతో మహిషాసుర మర్దిని రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. అసుర సంహారంలో మహిషుడు అనే రాక్షసుడుని దుర్గమ్మ సంహరించినట్లుగా పురాణంలో చెప్పబడి ఉన్న నేపద్యంలో మహిషాసుర మర్దిని దేవిగా అత్యంత విశేషమైన రోజుగా ఈరోజు చెప్పబడుతుంది.

భక్తులకు భయాన్ని పోగొట్టి అభయాన్నివసగే అయిగిరి నందిని అవతారంగా భక్తులు కొలుస్తూ ఉంటారు. ఈ రోజున

అయిగిరినందిని నందితమేదిని! విశ్వవినోదిని! నందిను గిరివర వింధ్య శిరోధినివాసిని ! విష్ణువిలాసిని! జిష్ణునుతే! భగవతి! హే శితికంఠకుటుంబిని! భూరికుటుంబిని భూరికృతే !

జయజయ! హే మహిషాసురమర్దిని! రమ్యకపర్దిని! శైలసుతే !

అమ్మవారిని మూల మంత్రంతో స్మరించుకుంటూ లక్షలాదిమంది భక్తులు ఈ దర్శనం చేసుకున్నారు. అమ్మవారుసింహవాహినియై, దుష్టుడైన మహిషా సురుని సంహరించి ఋషుల, మానవుల కష్టాలను తొలగించినట్లుగా చరిత్రలో చెప్పబడి ఉంది. మహిషాసుర మర్దినీదేవి అలంకారములో ఉన్న శ్రీఅమ్మవారిని దర్శించడం వలన అరిష్ట్యర్గాలునశిస్తాయి, తత్ఫలితంగా సాత్వికభావం ఉదయిస్తుంది. సర్వదోషాలు పటా పంచలు అవుతాయి. ధైర్య సాహసాలు సిద్ధిస్తాయని భక్తులు నమ్మకం.

సద్దుల బతుకమ్మను వీక్షించిన ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షులు



ఇది కద నిజం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా :కామారెడ్డి జిల్లా పిట్లం మండల కేంద్రంలో సద్దుల బతుకమ్మ సందర్భంగా జాతీయ బీసీ రాజ్యాధికార సమితి జిల్లా అధ్యక్షుడు కుమ్మరి యాదగిరి ఆధ్వర్యంలో ప్రత్యేకంగా అలంకరించిన బతుకమ్మ ఆకట్టుకుంది. నరసింహస్వామి తోరణంతో పాటు కొల్హాపూర్ శ్రీ అంబాభవానీ మహాలక్ష్మి మాత, తుల్జాపూర్ తుల్జాభవాని మాత అవతారాలను ప్రతిబింబించేలా కిరీటంతో చేసిన అలంకరణ భక్తులను విశేషంగా ఆకర్షించింది. సంప్రదాయ బతుకమ్మకు ఆధ్యాత్మిక శోభను జోడించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ బతుకమ్మనుజుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీ కాంతారావు, డీసీసీ అధ్యక్షులు మల్లికార్జున్ వీక్షించి సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షుడు ఇమ్రోజ్ సొసైటీ డైరెక్టర్ కుమ్మరి యాదమ్మ చిన్న రాములు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య బద్ధంగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే..!



ఇది కద నిజం న్యూస్ కడపజిల్లా అక్టోబర్ 19: కడప నగరంలోని వైఎస్ఆర్ సీపీ జిల్లా కార్యాలయం లో మాజీ మేయర్ పాకా సురేష్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ... కడప లో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారంటూ కూటమి ప్రభుత్వంపై పాకా సురేష్ మండిపడ్డారు. స్థానిక ఎన్నికల్లో ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేసే పరిస్థితి లేకుండా పోయిందని ఎద్దేవాచేశారు. కడపలో రాజ్యాంగం అమలవుతోందా.? లేదా? అన్న అనుమానం కలిగించేలా పరిస్థితులు ఉన్నాయన్నారు. బీహార్, ఉత్తరప్రదేశ్‌ను తలపించేలా కడపలో ఎన్నికల హింసాత్మక పరిస్థితులు ఉన్నాయని ఆరోపించారు.

అధికార పార్టీకి అనుకూలంగా వార్డుల పునర్విభజన.. వైఎస్సార్‌సీపీ ఓట్లను చీల్చేలా కుట్ర చేశారని మండిపట్టారు. ఓటర్ల జాబితాలో అవకతవకలపై సుమారు 68 ఫిర్యాదులు జిల్లా ఎన్నికల అధికారులకు చేసినా పట్టించుకోలేదని విమర్శించారు. ఎస్సీ, బీసీ, ఓసీ, మహిళల రిజర్వేషన్ల ఖరారులో అధికార పార్టీ జోక్యం చేసుకుందన్నారు. కడప ఎన్నికల్లో ఇతర ప్రాంతాల నుంచి రౌడీ మూకలను రప్పించారంటూ కూటమి నేతలపై పాకా సురేష్ ఆరోపణ చేశారు. ఏడు నామినేషన్ కేంద్రాల వద్ద వైఎస్సార్‌సీపీ అభ్యర్థులపై దాడులు.. నామినేషన్ పత్రాలు చించివేశారని, అధికార పార్టీ నేతల ఒత్తిడికి పోలీసులు తలొగ్గినట్టుగా అనుమానం కనిపిస్తుందన్నారు. నామినేషన్ కేంద్రాల్లో పోలీసుల తీరుపై తీవ్ర మైన ప్రశ్నలు లేవనెత్తాల్సిన పరిస్థితి ఎదురయింది అన్నారు. నామినేషన్ వేయడానికి వచ్చిన వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు రక్షణ కల్పించడంలో పోలీసులు విఫలమ య్యారని ఆరోపించారు. నామినేషన్లు దాఖలు చేసిన 11 మంది అభ్యర్థుల పత్రాలను సరైన కారణాలు చెప్పకుండానే తిరస్కరించారని ఆవేదన వ్యక్తం చేశారు. హైకోర్టు నుంచి రక్షణ ఉత్తర్వులు తెచ్చినా అమలు చేయలేదని.. పోలీసుల వ్యవహారశైలిపై పాకా సురేష్ మండిపడ్డారు. హైకోర్టు ఉత్తర్వులకే విలువ లేదా.? ఎన్నికల వేళ చట్టాన్ని అమలు చేయాల్సిన పోలీసులపై అనేక ప్రశ్నలు మిగిలి పోయాన్నారు. ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికలు నిర్వహించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే... అంటూ నామినేషన్ల అడ్డగింతపై సమాధానం చెప్పాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
మంగళవారం 20-10-2026

కాఫర్ డ్యాం నిర్మించి ప్రాణహిత నీటిని మళ్లించాలి

- నవంబర్ నెలాఖరులోగా కాఫర్ డ్యాం నిర్మించుకుంటే కన్నేపల్లి పంపు హౌస్ వద్ద ఆందోళన చేస్తాం
- మేడిగడ్డను బూచీగా చూపి రైతులకు నష్టం చేయవద్దు
- ప్రశ్నించి, పోరాడటమే కాకుండా ప్రభుత్వానికి పరిష్కార మార్గాలను చెబుతున్నాం
- తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత
- పార్టీ నాయకులతో కలిసి కన్నేపల్లి పంప్ హౌస్ వద్ద ప్రాణహిత ప్రవాహాన్ని పరిశీలించిన టీఆర్ఎస్ చీఫ్



ఇది కద నిజం,కన్నేపల్లి పంప్ హౌస్, కాళేశ్వరం: రాష్ట్రంలో కరువు పరిస్థితులను ఎదుర్కొని రైతులకు మేలు చేయాలంటే వెంటనే కన్నేపల్లి పంప్ హౌస్ వద్ద 93 మీటర్ల ఎత్తులో కాఫర్ డ్యామ్ నిర్మించి ప్రాణహిత నీళ్లను మళ్లించాలని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత ప్రభుత్వానికి సూచించారు. కేవలం రూ. 25 కోట్లు ఖర్చు చేస్తే నెలన్నర రోజుల్లో ఈ డ్యామ్ ను పూర్తి చేయవచ్చన్నారు. సోమవారం కన్నేపల్లి పంప్ హౌస్ ను టీఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి ఆమె సందర్శించారు. అక్కడ నీటి ప్రవాహాన్ని పరిశీలించిన తర్వాత పవర్ పాయింట్ ప్రజేంటేషన్ ద్వారా కాఫర్ డ్యామ్ నిర్మాణం ఎక్కడ చేపట్టవచ్చో...దాని ద్వారా ఎలాంటి ప్రయోజనం ఉంటుందో వివరించారు. రాష్ట్రంలో ఎంతటి కరువు పరిస్థితులున్న సరే ప్రాణిహిత నదిలో రోజుకు రెండు టీఎంసీల నీళ్లు ప్రవాహిస్తుంటాయన్నారు. ఆ నీటిని సరిగా వాడుకుంటే చాలని చెప్పారు. నవంబర్ లోగా కాఫర్ డ్యామ్ నిర్మించాలని రైతుల తరఫున ప్రభుత్వానికి వినమ్రంగా విజ్ఞప్తి చేస్తున్నామని..వినకపోతే ప్రభుత్వం మెడలు ఎలా వంచాలో తమకు తెలుసని అన్నారు. మేడిగడ్డ బూచిని చూపి రైతులకు నష్టం చేస్తే ఊరుకోమని హెచ్చరించారు. కరువు కోరల్లో చిక్కుకున్న రాష్ట్రాన్ని గట్టెక్కించేందుకు తాము ఎంతో అధ్యయనం చేసి నిపుణులతో మాట్లాడి కాఫర్ డ్యామ్ నిర్మాణమే సొల్యూషన్ అని గుర్తించామన్నారు. ఇందుకు సంబంధించిన టెక్నికల్ డీయిటెల్స్ ను కూడా ప్రభుత్వానికి ఇస్తామన్నారు. తామిచ్చిన సూచనను నిపుణులతో మాట్లాడి ప్రభుత్వం పరిశీలించాలని..ఈ విషయంలో ఏదైనా మార్పులు ఉన్నా సరే తాము అంగీకరిస్తామన్నారు. ఎట్టి పరిస్థితుల్లో రైతులకు నష్టం జరగకూడదనేది తమ తాప్రయతమని చెప్పారు. వెంటనే ప్రభుత్వం ఈ పనులను చేపట్టి కరువు కోరల్లోంచి బయటపడే ప్రయత్నం చేయాలన్నారు.

ప్రశ్నించటమే కాదు పరిష్కారం చూపిస్తాం

ప్రభుత్వాన్ని ప్రశ్నించటమే కాకుండా పోరాటం చేస్తూ పరిష్కారానికి కూడా తామే మార్గం చెబుతామని కవిత అన్నారు. ఇతర పార్టీల మాదిరిగా రెండు రోజులు హడావుడి చేసి టీవీల్లో కనిపించటం తమ ఉద్దేశం కాదని చెప్పారు. కరువు నుంచి బయటపడాలంటే ఏం చేయాలన్న దానిపై నిపుణులతో మాట్లాడిన తర్వాతే కాఫర్ డ్యామ్ అనే ఆలోచన చేశామన్నారు. అదే విధంగా రాష్ట్రంలో నవంబర్ వరకు రైతులకు నీళ్లు, కరెంట్ ఎట్టి పరిస్థితుల్లో ఇవ్వాల్సిందేనని చెప్పారు. కరువు పరిస్థితులను ముందే గ్రహించి కొన్ని రోజుల క్రితమే రైతులకు నవంబర్ వరకు ఉచిత కరెంట్ ఇవ్వాలని తామే డిమాండ్ చేశామని గుర్తు చేశారు. తాము కోరిన తర్వాతే ముఖ్యమంత్రి ఈ అంశంపై స్పందించి కేంద్రాన్ని కరెంట్ అడుగుతామని చెప్పారన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం కోటి 10 లక్షల ఎకరాల పంటకు నీళ్లు, కరెంట్ అవసరం ఉందని చెప్పారు. నవంబర్ చివరి వరకు కరెంట్, నీళ్లు ఇచ్చి రైతుల పంటలను కాపాడాలని కోరారు. ప్రతిపక్షాలంటే ఓ వైపు ప్రభుత్వంపై పోరాటం చేస్తూనే సమస్య పరిష్కారానికి సొల్యూషన్ కూడా చెప్పాలన్నారు. ప్రశ్నించు, పోరాడు, పరిష్కారించు అనే నినాదంతో ఆ పనిని తమ పార్టీ చేస్తుందని చెప్పారు. కరెంట్, నీళ్లు ఇచ్చే పరిస్థితి ఉన్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని..ఈ విషయాన్ని రాష్ట్రంలోని ప్రతి రైతుకు తెలిసేలా చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

తెలంగాణ వచ్చాక కూడా నీళ్ల విషయంలో న్యాయం జరగలే

తెలంగాణ రాష్ట్రం వచ్చి 13 ఏళ్లు గడుస్తున్నప్పటికీ కూడా మనం మన వాటా నీళ్లను సంపూర్ణంగా



వాడుకోలేని దుస్థితిలో ఉన్నామని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. మా నీళ్లు మాకేనంటూ పిడికిలెత్తి తెలంగాణ ఉద్యమం చేసిందే నీళ్ల కోసమని గుర్తు చేశారు. కానీ తెలంగాణ వచ్చాక కూడా మన నీళ్లను మనం వాడుకోలేకపోతున్నామన్నారు. నిజానికి మనకున్న రెండు పెద్ద నదులైన గోదావరి, కృష్ణా నీళ్లను సరిగా వాడుకుంటే రాష్ట్రంలో కరువు అనే పరిస్థితే ఉండదని చెప్పారు. కానీ బీఆర్ఎస్ ప్రభుత్వం లక్షా 80 వేల కోట్లు ఖర్చు చేసి కృష్ణా నది పరివాహంలో 4 నుంచి 5 లక్షలు, గోదావరి లో లక్ష ఎకరాలకు మాత్రమే కొత్తగా నీళ్లు ఇచ్చిందని చెప్పారు. కాళేశ్వరం కోసం 93 వేల కోట్లు ఖర్చు చేసినప్పటికీ పాత ఆయకట్టు స్థిరీకరణ, వరద ప్రవాహం కోసం మాత్రమే వాటిని ఖర్చు చేశారన్నారు. కాళేశ్వరం కాలువలను పూర్తి చేయాలంటే మరో 50 వేల కోట్లు ఖర్చు చేయాల్సి ఉంటుందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఆ పరిస్థితి ఉంటే కాంగ్రెస్ వచ్చాక పరిస్థితి మరింత దిగజారిందన్నారు. రూ. 26 వేల కోట్లు ఖర్చు చేసి తట్టెడు మట్టి కూడా ఎత్తలేదని ధ్వజమెత్తారు. అడిగితే పాత బకాయిలు చెల్లించామని చెబుతున్నారని, ఫీజు రీయింబర్స్ మెంట్, దళిత బంధు లాంటి బకాయిలు ఎందుకు చెల్లించటం లేదని ప్రశ్నించారు. మేడిగడ్డ బూచి చూపించి రైతులకు అన్యాయం చేయవద్దని..వెంటనే కాఫర్ డ్యామ్ పనులు చేపట్టాలని కోరారు. అదే విధంగా మేడిగడ్డ బ్యారేజ్ పనులను పూర్తి చేసేందుకు కూడా ఇదే మంచి సమయమని వెంటనే ఆ పనులను కూడా పూర్తి చేయాలన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో 21 వేల చెరువులు ఎండిపోయి రైతులు, ముదిరాజ్ లు, బెస్త సోదరులు బాధలో ఉన్నారని చెప్పారు. వచ్చే పది నెలలు ఇంకా భయంకరమైన పరిస్థితులుంటాయని..వాటి నుంచి బయటపడేందుకు తామిచ్చిన సూచనను ప్రభుత్వం సీరియస్ గా పరిశీలించాలన్నారు.

చిన్న కాళేశ్వరం పూర్తి చేయాలి

మంథని నియోజకవర్గంలో చిన్న కాళేశ్వరం ప్రాజెక్ట్ ను వెంటనే పూర్తి చేయాలని కవిత డిమాండ్ చేశారు. మంత్రి శ్రీధర్ బాబు ఇక్కడ ప్రజలకు చిన్న మాటను నిలబెట్టుకోవాలని కోరారు. అదే విధంగా ముంపు బాధితులకు సరైన పరిహారం కల్పించాలన్నారు. పదేళ్లు ప్రతిపక్షం ఉన్న సమయంలో ప్రజలకు మాటిచ్చిన శ్రీధర్ బాబు అధికారంలోకి వచ్చి మూడేళ్లు గడిచిన ఎందుకు మాట నిలబెట్టుకోవటం లేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి బోడ జనార్దన్, పార్టీ సీనియర్ నాయకులు రియాజ్ అహ్మద్, ఇస్మాయిల్, నవీన్ కుమార్, రవిచంద్ర, వెంకట్, నరేశ్ నేత తదితరులు పాల్గొన్నారు.

గౌరారం గ్రామ ప్రజలకు అందరికీ దసరా శుభాకాంక్షలు

- గ్రామ సర్పంచ్ లోకినేని హనుమంత్ రావు



ఇది కద నిజం,ఉమ్మడి నిజామాబాద్ జిల్లా: కామారెడ్డి జిల్లా పిట్లం మండలం గౌరారం గ్రామ సర్పంచ్ లోకినేని హనుమంతరావు గ్రామ ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే దసరా పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, శాంతి సౌభాగ్యాలు నింపాలని ఆకాంక్షించారు. గ్రామ ప్రజలందరూ ఐకమత్యంతో, సోదరభావంతో పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని ఆయన కోరారు.

8వ ప్రపంచ తెలుగు మహాసభల "అంతర్జాల ప్రచార చిత్ర ముద్రిత ప్రతి" ఆవిష్కరణ

కొత్తపేట(ఇది కద నిజం) అక్టోబర్ 19 : అంతర్జాతీయ ప్రమాణాల నిర్ధారణ సంస్థ" గుర్తింపు పొందిన తొలి సాహిత్య, సాంస్కృతిక, సామాజిక, సేవా సంస్థ 'శ్రీశ్రీ కళా వేదిక' అధ్యక్షులు కత్తిమండ ప్రతాప్ కుమార్ ఆధ్వర్యంలో నవంబర్ ఒకటవ తేదీ ఆదివారం ధవళేశ్వరం లోని 'గౌతమీ సదన్' (గౌతమీ సమావేశ మందిరం) లో నిర్వహించనున్న ఆ సంస్థ 177వ కార్యక్రమం, 8వ ప్రపంచ తెలుగు సాహిత్య మహోత్సవ సభ విజయంవంతం కావాలని ఆకాంక్షిస్తూ కోనసీమ జిల్లా కొత్తపేట కళాసాహితి వ్యవస్థాపకులు గిడ్డి సుబ్బారావు నివాసమైన 'కవితా విపంచి' ప్రాంగణంలో శ్రీ శ్రీ కళావేదిక మహాసభల "అంతర్జాల ప్రచార చిత్రపు ముద్రిత ప్రతి" ఆవిష్కరణ జరిగింది.





తెలుగు భాష వెలుగును, ఉనికిని, వైభవాన్ని దశదిశలా వ్యాపింపజేయాలనే సత్సంకల్పంతో అనేక సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలను దేశంలోని పలు పట్టణాలలో మాత్రమే కాకుండా విదేశాలలో సైతం నిరంతరాయంగా నిర్వహిస్తూ తెలుగు ఔన్నత్యాన్ని, విశిష్టతలను ప్రపంచానికి బహుముఖంగా చాటుతున్న 'శ్రీశ్రీ కళావేదిక' నూతన అంతర్జాల ప్రచార చిత్రపు ముద్రిత ప్రతిని కొత్తపేట కవులు అత్యంత శ్రద్ధాసక్తులతో ఆనందోత్సాహాల నడుమ ఈరోజు ఆవిష్కరించారు.

ఈ కార్యక్రమంలో కళాసాహితి సంస్థ ప్రధాన కార్యదర్శి గిడ్డి సుబ్బారావుతో పాటు అధ్యక్షులు పెన్మెత్స హరిహర దేవళరాజు, క్రియాశీలక సభ్యుడు అద్దంకి బుద్ధ చంద్ర దేవ్, సభ్యులు గౌస్ మొహిద్దీన్, ఖాజా మొహిద్దీన్, వివివిఎస్సెస్ సుబ్బారావు, కోటిపల్లి రామకృష్ణ, పోలిశెట్టి మాచర రావు, సిద్ధంశెట్టి నారాయణ ప్రసాద్, వాసంశెట్టి కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

ఏపీ హెచ్ఆర్సీ ఛైర్మన్‌ను కలిసిన పల్లెటి వెంకటేష్ నాయుడు

- నూతన హెచ్ఆర్సీ చైర్మన్ సత్యనారాయణమూర్తి కి అభినందనలు
- బాధితులకు సత్వర న్యాయం అందాలని ఆకాంక్ష



నెల్లూరు జిల్లా సైదాపురం (ఇది కద నిజం):-నెల్లూరు జిల్లా సైదాపురం మండలం కమ్మవారిపల్లె గ్రామానికి చెందిన పల్లెటి వెంకటేష్ నాయుడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ ఛైర్మన్‌గా నియమితులైన విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ మల్లావోలు సత్యనారాయణమూర్తిని విజయవాడలోని ఆయన స్వగృహంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి హోదాతో సమానమైన బాధ్యతలు కలిగిన రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించబోతున్న జస్టిస్ సత్యనారాయణమూర్తికి పల్లెటి వెంకటేష్ నాయుడు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. నూతన బాధ్యతల్లో వారు మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, ప్రజలకు, బాధితులకు న్యాయం అందించడంలో విశేష సేవలు అందించాలని ఆకాంక్షించారు. మానవ హక్కుల పరిరక్షణలో కమిషన్ మరింత సమర్థవంతంగా పనిచేస్తూ బాధితులకు సత్వర న్యాయం అందించాలని ఈ సందర్భంగా ఆయన ఆకాంక్షించారు. న్యాయవ్యవస్థలో ఉన్న అపారమైన అనుభవంతో జస్టిస్ సత్యనారాయణమూర్తి ప్రజలకు విశేష సేవలు అందిస్తారనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. అలాగే తమ కుటుంబ సన్నిహితులైన జస్టిస్ సత్యనారాయణమూర్తిని కలవడం తనకు ఎంతో ఆనందంగా ఉందని పల్లెటి వెంకటేష్ నాయుడు పేర్కొన్నారు.

రాచమల్లు.. మీ వైయస్సార్సీపి ప్రభుత్వంలో గొడవలు, ఏకగ్రీవాలు.. చెయ్యలేదా..?

- పులివెందుల టిడిపి ఇంచార్జ్ బిటెక్ రవి..

ఇది కద నిజం న్యూస్ కడపజిల్లా అక్టోబర్ 19: కడప జిల్లా.. ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివ ప్రసాద్ రెడ్డి వ్యాఖ్యలకు బదులుగా సోమవారం పులివెందుల టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి రవీంద్రనాథ్ రెడ్డి, బీటెక్ రవి సమాధానమిస్తూ.. గతంలో వైయస్సార్సీపి ప్రభుత్వ హయాంలో ఏకగ్రీవాలు చేసుకున్న విషయం గుర్తు రాలేదా. శివప్రసాద్ రెడ్డి.? ఇప్పుడేమో మీడియా సమావేశంలో నీతి వాక్యాలను మళ్లిస్తున్నవ్.. మీ ధూమ్ తగిలిపోను.. ఓటుకు టిడిపి వాళ్ళు 2000 వైఎస్ఆర్సిపి పార్టీ తరఫున మేము మాకు ఉన్న ఆస్తులు అమ్ముకొని 2000 మొత్తం గా వెరిసి ఓటుకు నాలుగువేల రూపాయలు ఓటర్లకు డబ్బులు వచ్చే వెని ఏకగ్రీవాలతో ఈ డబ్బు ప్రజలకు రాకుండా తెలుగుదేశం వాళ్ళు చేశారని మీడియా సమావేశంలో ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే శివప్రసాద్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు ఘాటుగా స్పందిస్తూ.. ఆ లెక్కన పులివెందుల ప్రజలకు 40 కోట్లు వడ్డీతో సహా 80 కోట్లు ప్రజలకు పంచండి.. అంటూ బీటెక్ రవి కౌంటర్ ఇస్తూనే.. అప్పుడు మా టిడిపి వాళ్ల తో కూడా నామినేషన్లు విత్ డ్రా చేస్తాం అన్నారు. రానున్న సార్వత్రిక 2029 ఎన్నికలలో వైఎస్ఆర్సిపి అధికారం లోకి వస్తారో.? రాదో.? తెలియకుండానే మేము వస్తే ఇప్పుడు అడ్డగోలుగా గెలిచిన సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, మున్సిపల్ చైర్మన్లు, కౌన్సిలర్లు, మేయర్లు, రాజీనామా చేయిస్తున్నామని బెదిరిస్తున్నారు. రాచమల్లు.. ప్రతిపక్షంలో ఉన్న మీరే అలా మాట్లాడితే.. అధికారంలో ఉన్న మా నాయకులు కార్యకర్తలు ఎలా మాట్లాడుతారు.. ఊహించుకోండి రాచమల్లు.. వైసీపీ ప్రభుత్వంలో సింహాద్రిపురం జడ్పీటిసి నామినేషన్ వేయడానికి కడపకు వెళ్తే వారి నామినేషన్లు చించేశారు. ఆ రోజులు గుర్తు లేవా.? రాచమల్లు.. అదేవిధంగా ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి నిలబడినప్పుడు లింగాల్లో మాపైన దాడులు చేశారు. ఇవన్నీ మీకు గుర్తుకు లేవా అని సూటిగా రాచమల్లును ప్రశ్నించారు. వేంపల్లి లో ఎస్సీ అభ్యర్థి నామినేషన్లు వేస్తే ఆమెతో ఎటువంటి సంబంధం లేకుండా ఫోర్జరీ సంతకాలు చేసి విత్ డ్రా చేసిన ఘనత మీది మీ వైఎస్ఆర్సిపి పార్టీది కాదా రాజమల్లు.? అవినాష్ రెడ్డి వాళ్ళ అనుచరులు రాళ్లతో పోలీసులపై దాడులు చేశారు. కార్యకర్తలను కాపాడుకునే వారే నాయకుడు కార్యకర్తలను కేసులలో ఇరికించే వాళ్ళు నాయకుడు కాదన్నారు. ఐదేళ్ల క్రితం మీరు వేసిన విత్తనమే ఈ ఎన్నికలని అన్నారు.. ఇలాంటి సంస్కృతి నేర్పింది మీరు మీ వైఎస్ఆర్సిపి పార్టీ కాదా రాచమల్లు..? వైసిపి ప్రభుత్వం లో వాళ్లు మొత్తం ఏకగ్రీవాలు చేసుకున్నారని బీటెక్ రవి తెలిపారు. మా కార్యకర్తల కోసం మేము ఎంత దూరమైనా వెళ్తామని అన్నారు. మీ నాయకుని మాట విని మీరు బలి పశువులు కావద్దని అన్నారు. ఎంపీ తో సహా 500 మందికి పైగా కేసులలో ఇరుక్కున్నారని అన్నారు.. మా కార్యకర్తలకు పదవులు వచ్చే దానిలో ఎటువంటి రాజీ అయ్యే పరిస్థితి లేదన్నారు. పులివెందుల ప్రశాంతతకు అందరూ సహకరించాలని కోరారు. ఎంపీ అవినాష్ రెడ్డికి, వాళ్ళ అన్న జగన్ రెడ్డి కు కార్యకర్తలను రెచ్చగొట్టాలని చూస్తున్నారన్నారు. ముద్దాయిలుగా ఉన్న వ్యక్తులు కూడా ఈరోజు స్ట్రాటజీకి వచ్చి అక్కడే వచ్చి ఉన్నారని బీటెక్ రవి తెలియజేశారు.

